క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 23న సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యురాలు జనరల్ బాడీ పాల్గొంటారన్నారు. మండల గ్రామస్థాయి అధికారులు అందరు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

కేసు విచారణకు ఏఎస్పీ రాక

నాదెండ్ల: గణపవరం గ్రామానికి చెందిన నాగళ్ల లెనిన్ 2022 నవంబర్ 30వ తేదీన పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ డిసెంబర్ 1వ తేదీన మృతి చెందాడు. చికిత్స పొందే సమయంలో న్యాయమూర్తికి మరణ వాంగ్మూలం ఇచ్చాడు. అప్పట్లో ఎస్ఐ ఆవుల భాస్కర్ కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు న్యాయస్థానంలో ఉండగా, విచారణ నిమిత్తం పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ సంతోష్ గణపవరం గ్రామానికి వచ్చి వివరాలు సేకరించారు. రూరల్ సీఐ సుబ్బానాయుడు, ఎస్ఐ జి.పుల్లారావు ఉన్నారు. లెనిన్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేసేవాడు. భార్యతో మనస్పర్థల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

సీసీఐ కేంద్రంలో పత్తి కొనుగోళ్లు



నాదెండ్ల: గణపవరం సీసీఐ కేంద్రంలో పత్తి కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. తెల్లవారుజాము నుంచే రైతులు ట్రాక్టర్లు, ఆటోల్లో పత్తిని తరలిస్తున్నారు. పెద్దఎత్తున వాహనాలు సర్వీసు రోడ్డుపై బారులు తీరాయి. ఇటీవల పత్తి రైతులు కొనుగోళ్ల జరపటం లేదంటూ సీసీఐ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. దీనిపై స్పందించిన సీసీఐ ఉన్నతాధికారులు మార్కెటింగ్ శాఖ కేంద్ర, రాష్ట్ర అధికారులు సీసీఐ కేంద్రాన్ని సందర్శించారు. పత్తి కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించారు. అప్పటి నుంచి రైతులకు కొంతమేర ఊరట కలిగింది. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు తరలివస్తున్నాయి.

24న అబ్దుల్లా బాషాబాబా ఉరుసు మహోత్సవం





అబ్దుల్లా బాషా బాబా (ఫైల్)

చిలకలూరిపేట: పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం పోతవరం గ్రామంలో వేంచేసి ఉన్న మౌలానా మౌల్వీ మహమ్మద్ అబ్దుల్లా బాషాబాబా 73వ ఉరుసు మహోత్సవం ఈ నెల 24వ తేదీ నిర్వహించనున్నారు. 25వ తేదీన దీపారాధన ఉంటుంది.. ఉరుసు రోజు 24వ తేదీ భారీ అన్నదానం నిర్వహించనున్నారు. 1953 సంవత్సరం నుంచి క్రమం తప్పకుండా అబ్దుల్లా బాషాబాబా వారి వారసులు గంధ మహోత్సవం చేస్తూ వస్తున్నారు.

మరుగుదొడ్లు తప్పక వినియోగించాలి




వినుకొండ(నూజెండ్ల): మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా వినుకొండ మండలంలోని భారతాపురం, నడిగడ్డ పంచాయతీల్లో సర్పంచ్ తోట రమణకుమారి, దేవర సంతోషం అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛభారత్ మండల రీసోర్స్ కో–ఆర్డినేటర్ ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామంలో నివసిస్తున్న ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మరుగుదొడ్లు ఉపయోగించుకోవాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి కుటుంబం వారి మరుగుదొడ్డిని నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

సత్తెనపల్లి: బెల్ట్ షాపులను నడిపిస్తే.. మద్యం దుకాణదారులను అరెస్టు చేసి, షాపు లైసెన్సును రద్దు చేయడం జరుగుతుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సత్తెనపల్లి సీఐ పి.విజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో ప్రైవేట్ మద్యం దుకాణదారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐ విజయ్‌కుమార్ మాట్లాడుతూ అనధికార మద్యం విక్రయాలు చేయకూడదని చెప్పారు. ఎమ్మార్పీకే మద్యాన్ని విక్రయించాలన్నారు. సమావేశంలో సత్తెనపల్లి ఎస్ఐ కె.నాగలక్ష్మి, మద్యం వ్యాపారులు పాల్గొన్నారు.

పగలే కరెంటు ఇవ్వండి

- రాత్రిళ్లు సరఫరా చేస్తే విష పురుగులతో ఇబ్బంది
- పగలు ఇవ్వకపోవడంతో అనేక సమస్యలు
- గత ప్రభుత్వంలో ఉదయమే ఇచ్చేవారు
- వాపోతున్న పలువురు రైతన్నలు





బొల్లాపల్లి : రాత్రివేళ విద్యుత్ సరఫరాలో అగచాట్లు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. పంట సాగు సీజన్ అదును కావడంతో నీరు కట్టడానికి పగటిపూట కరెంటు ఇవ్వకపోవడం వలన పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో రైతాంగాన్ని గుర్తించి అప్పట్లో త్రీపేజ్ కరెంటు పగటిపూట మాత్రమే సరఫరా చేయాలని నిబంధనలు ఉండేవి. ఇటీవల కాలంలో ట్రాన్స్‌కో అధికారులు పగటిపూట కరెంటు సప్లయ్‌ని తప్పించి రాత్రిపూట కరెంటు సరఫరా చేస్తున్నారని, ఈ నేపథ్యంలో పొలాలకు నీరు కట్టడానికి వెళితే విష పురుగుల బారిన పడే అవకాశం ఉందని, ప్రాణాపాయం నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో అధికంగా బోర్లపై ఆధారపడి సాగు ఉంటుందని, పంటలకు నీటి అవసరాల నిమిత్తం కరెంటు సరఫరా ఆవశ్యకతను గుర్తించి ట్రాన్స్‌కో అధికారులు పగటిపూట విద్యుత్ సరఫరా చేయాలని అంటున్నారు. రాత్రి సమయాల్లో పొలాలకు వెళ్లడానికి ఇబ్బందికర పరిస్థితుల నేపథ్యంలో ట్రాన్స్‌కో అధికారులు గుర్తించి ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో వంతుల వారీగా సరఫరా చేయాలని వాపోతున్నారు.

రేమిడిచర్ల పరిధిలో..

రేమిడిచర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని రేమిడిచర్ల, గుమ్మనంపాడు, రావులాపురం ఫీడర్స్ పరిధిలో వంతుల వారీగా అర్ధరాత్రి సమయాల్లో సరఫరా జరుగుతుందని, అదేవిధంగా మండలంలోని చక్రాయపాలెం, అయ్యన్నపాలెం, రావులాపురం, గుట్లపల్లి తదితర సబ్‌స్టేషన్ల పరిధిలో ఇదే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు గుర్తించి గతంలో రైతులకు అనుకూలంగా పగటిపూట మాత్రమే కరెంట్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

మరమ్మతు సమస్యల వల్లే...

సబ్‌స్టేషన్‌ల పరిధిలో పగటిపూటే కరెంటు సరఫరా జరుగుతుందని, రోజుకు 9గంటల సరఫరా ఉంటుందన్నారు. ఆయా సమయాల్లో ఆయా సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఏమైనా అనుకోని మరమ్మతులు చేపడితే సరఫరాను మిగిలిన సమయం రాత్రి పూట రైతులకు కరెంటును అందిస్తున్నామని తెలిపారు.

– శ్రీనివాసరెడ్డి, ట్రాన్స్‌కో అధికారి

'పది' ఫలితాల్లో ప్రథమంగా నిలపండి

- డీవైఈఓ కె.వేణుగోపాలరావు
- కావూరు జెడ్పీ హైస్కూల్‌లో తనిఖీలు



ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొన్న డీవైఈఓ కె.వేణుగోపాలరావు

చిలకలూరిపేటటౌన్: మండలంలోని కావూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వార్షిక తనిఖీ జరిగింది. పల్నాడు జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి వేణుగోపాలరావు సందర్శించి పాఠశాల విద్యాబోధన, మౌలిక సదుపాయాలు, చిక్కీల పంపిణీ, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలను తనిఖీ చేశారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, గణితం, పీఎస్, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం, వ్యాయామశాస్త్రం పరిశీలకులుగా బి.శ్రీనివాసరావు, శంకరరావు, నజీర్ అహమద్, కేవీ రామిరెడ్డి, రఘురామ్, టి.సుగంధరావు, కిషోర్, అచ్చేమియా పరిశీలకులుగా, సమన్వయకర్తగా బి.వెంకట్ వ్యవహరించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి తగు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణతలో ప్రథమంగా నిలిపేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులను గుర్తించి ప్రత్యక్ష శిక్షణ ఇవ్వాలని, ఉదయం, సాయంత్రం అదనపు క్లాసులు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై అడ్డంగా విద్యుత్ స్తంభం

తొలగించాలని మన్నేపల్లిపాడు తండా వాసుల వినతి



తండాలో అంతర్గత రహదారి మధ్యలో ఉన్న కరెంటు స్తంభం

బొల్లాపల్లి: మండలంలోని మన్నేపల్లిపాడు తండాలో రహదారికి అడ్డంగా విద్యుత్ స్తంభం ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై ద్విచక్రవాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగించాలంటే అడ్డంగా ఉంది. ఆ దారిలో ఉన్న గృహాల వారు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. గతంలో పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని, రోడ్డుకు అడ్డంగా ఉన్న కరెంటు స్తంభాన్ని తొలగించాలని అంటున్నారు. పంచాయతీ రాజ్, ట్రాన్స్‌కో అధికారులు స్పందించి అంతర్గత రహదారికి అడ్డంగా ఉన్న స్తంభాన్ని తొలగించి పక్కనే ఏర్పాటు చేయాలని తండా వాసులు కోరుతున్నారు.

పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- గ్రామీణ రహదారులపై యూజర్ చార్జీల విధింపు నిర్ణయం సరికాదు
- ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు

చిలకలూరిపేట: ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు కోరారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి దిగుబడి గణనీయంగా తగ్గిందని, ఈ కారణంగా పత్తి ధర పతనమయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిబంధనల పేరుతో కాలయాపన చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తిలో తేమ ఉందని పేచి పెడుతున్నారని, నిబంధనల సుడిగుండంలో రైతులు పత్తి అమ్ముకోడానికి అవస్థ పడుతున్నారని వెల్లడించారు. గత్యంతరం లేక పత్తిరైతులు రోడ్లెక్కె పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం వెంటనే నష్టపోయిన పత్తిరైతులను ఆదుకోవాటానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారుల తరహాలో రాష్ట్రంలోని గ్రామీణ రోడ్లపై యూజర్ చార్జీలు వసూలు చేసే విధానాన్ని ప్రవేశపెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించటం అమానుషమని, ఇది ప్రైవేటీకరణకు దారి తీస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారుల నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలని నిర్ణయించారని, ఈ ఏజెన్సీలు వాహనదారుల నుంచి నిర్దేశిత యూజర్ చార్జీలు వసూలు చేయడం వల్ల గ్రామీణ ప్రజలపై పెనుభారానికి కారణమవుతుందన్నారు. అసలే పంటలు పండక రైతాంగం సతమతమవుతున్న తరుణంలో రోడ్లపై యూజర్ చార్జీలు వసూలు చేయాలని నిర్ణయించటం సహేతుకం కాదన్నారు. ప్రభుత్వమే రోడ్ల నిర్వహణ బాధ్యతలు చేపట్టి, యూజర్ చార్జీల భారం లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు చంద్ర కొండలరావు, ఎస్టీయూ నాయకులు వెంకటయ్య పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు అవగాహన


శావల్యాపురం: మండలంలోని ఇర్లపాడు, శావల్యాపురం గ్రామాల్లో స్వయం సహాయక మహిళా సభ్యులు జీవనోపాధులు, అభ్యున్నతిపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం జి.వాసుబాబు పాల్గొని మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల ఆదాయ మార్గాలు కుటుంబ సభ్యులను సమగ్ర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. ఈసర్వే కార్యక్రమం ప్రతి గ్రూపు దగ్గరకు స్వయంగా వీఓఏలు వెళ్లి సభ్యులు చెప్పిన వివరాలన్నీ నమోదు చేసుకోవాలన్నారు. సర్వే కార్యక్రమాన్ని క్లస్టర్ స్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. ఇందుకుగాను ఏలాంటి సర్వీసు చార్జీలు ఇవ్వాల్సిన పనిలేదన్నారు. అనంతరం ఉన్నతి పథకంలో పది మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.75 వేలు వడ్డీ లేని రుణాలను అందజేశారు. సర్పంచ్ రమాదేవి, సీసీ ఖాజావలీ, గ్రామ సంఘం అధ్యక్షురాలు విజయ, వీఓఏ మస్తాన్‌బీ పాల్గొన్నారు.

ఉపాధి నిధుల గోల్‌మాల్‌పై విచారణ



శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో తాగునీటి పథకం దగ్గర ఉపాధిహామీ కూలీలతో మరమ్మతులు చేయించి వేతనాలను పంచాయతీ ఖాతా నుంచి జమ చేసి కూలీలకు ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడిన సంఘటనపై జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన గ్రామ పంచాయతీ రికార్డు తనిఖీలు చేశారు. అనంతరం ఉపాధి కూలీలను ప్రత్యేకంగా విచారణ చేశారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఆయనతో పాటు డీఎల్‌పీఓ లక్ష్మణరావు, ఈఓపీఆర్డీ పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శి చింతా శ్రీనివాసరావు, ఏపీఓ కె.రామారావు ఉన్నారు.

వృత్తి విద్య శిక్షణ



దుర్గి: వ్యాపార అవగాహన కోసం ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా గుణ సూపర్ మార్కెట్‌ని గురువారం విద్యార్థులు సందర్శించటం జరిగిందని జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం కోటేశ్వరమ్మ, ఇన్‌చార్జి మల్లిఖార్జున పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెడ్పీహెచ్ఎస్ వృత్తి విద్యా కోర్సు రిటైల్ ట్రేడ్‌లో 9, 10 తరగతుల విద్యార్థులకు శిక్షణనిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విజిట్‌లో విద్యార్థులకు అమ్మకాలు, కస్టమర్ సర్వీసుల గురించి తెలిపారు. 10వ తరగతి బోర్డు నుంచి రిటైల్ సర్టిఫికెట్ వస్తుందన్నారు. దీంతో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను మెరుగుగా ఉంటాయన్నారు. హనుమంతరావు, గంగిరాజు, కృష్ణయ్య, చక్రపాణి పాల్గొన్నారు.

కాలువలకు మరమ్మతులు చేయాలి

ఎన్ఎస్పీ అధికారులను కోరిన ప్రజా సంఘాల నాయకులు



ఎన్ఎస్పీ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నరసరావుపేట: జిల్లాలోని ఎన్ఎస్పీ కాలువలకు మరమ్మతులు చేసి రైతులు కాలువపై తిరగడానికి దారి ఏర్పాటుచేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం బరంపేటలోని ఎన్ఎస్పీ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట కాలువల పరిస్థితిపై నిరసన వ్యక్తం చేసి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి నుంచి విటంరాజుపల్లె, సాయిబాబా గుడి పక్కన నుంచి రైలు గేటు అవతల వాగువరకు ఉన్న కాలువ ఎలాంటి మరమ్మతులకు నోచుకోక కుదించుకుపోయి, చెట్లు, ముళ్ళ కంపలతో అడవిని తలపిస్తుందన్నారు. రైతులు తమ పొలాలకు నీళ్లు పెట్టుకోవడానికి కాలువ వెంట వెళ్లేందుకు దారిలేక తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలువల మరమ్మతుల కోసం ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు విడుదల చేసిందని, ప్రతి ఏడాది కాలవల కట్టలు మరమ్మతులు చేస్తున్నామని ఎన్ఎస్పీ అధికారులు తరచూ మాట్లాడుతూ ఉన్నారని, ఆచరణలో శూన్యమన్నారు. బ్రాహ్మణపల్లి నుంచి విటంరాజుపల్లె శివారు వరకు ఉన్న కాలువ దశాబ్దాల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో కొంత అన్యాక్రాంతమైందన్నారు. కొన్ని ప్రాంతాల్లో కాలవ ఉన్న ఆనవాలు కూడా కనిపించట్లేదని అన్నారు. నరసరావుపేట మండలం అగ్రహారం నుంచి వచ్చే వాగు కాలువ, ములకలూరు, ఇసప్పాలెం, రంగారెడ్డి పాలెం, జొన్నలగడ్డ వైపు ఉన్న కాలువ పూడిపోయి, చెట్లు, కంప ఏర్పడి నీరు పారక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే మరమ్మతులు చేయించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఎన్ఎస్పీ అధికారులు, ఇతర అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే ఈ కాలువకు మరమ్మతులు చేపట్టి, కాలువపై రాకపోకల సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, బీసీ నాయకుడు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తరచూ కంటి పరీక్షలు చేయించుకోవాలి



కళ్ల పరీక్షలు చేయించుకుంటున్న విద్యార్థినులతో రోటరీ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవటం ద్వారా కళ్ల సమస్యలను పరిష్కరించుకోవచ్చని రోటరీ క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ రామలింగారెడ్డి మాక్స్ విజన్ సహకారంతో ప్రకాష్‌నగర్ తిలక్ మున్సిపల్ హైస్కూలులో నాలుగోరోజు ఉచిత ఐ క్యాంపు నిర్వహించి విద్యార్థులతో పాటు చుట్టుపక్కలనున్న ప్రజలకు కళ్ల పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ వక్తలు మాట్లాడుతూ నాలుగు రోజుల్లో సుమారు పదహారు వందలమందిపైన ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బందికి ఉచిత కంటి పరీక్షలు చేయడం జరిగిందన్నారు. శిబిరంలో సుమారు ఐదు వేల మందికి పైగా విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయటానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు,. రోటేరియన్ కపిలవాయి రమేష్ చంద్రదత్తు, కె.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ గవర్నర్ ఎం.సుమిత్రకుమార్, అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, సెక్రెటరీ శివకుమార్, క్లబ్ పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్ జిలాని మాలిక్, డైరెక్టర్ అచ్యుత్, మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బి.నిర్మలభాయి, తిలక్ స్కూల్ హెచ్ఎం కేఎస్ నరసింహారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబ్రాలెం మేజర్ కాలువలో నాచు తొలగింపు



కాలువలో నాచు తొలగింపజేస్తున్న నాయకులు

బెల్లంకొండ: ఎర్రబ్రాలెం మేజర్ కాలువలో నాచు, కంప చెట్లను తొలగిస్తున్నట్లు ఎన్ఎస్పీ ఏఈ ఇబ్రహీం తెలిపారు. కాలువలో నాచుపెరిగి నీటి సరఫరాకు నిత్యం ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు వెన్న సీతారామిరెడ్డి, క్రోసూరు టీడీపీ అధ్యక్షుడు గుడి బాష, పొన్నగంటి శివరాములు సొంత నిధులతో స్వచ్ఛందంగా కాలువకు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. గురవారం ఈ పనులను మండల పరిధిలోని నందిరాజుపాలెం హెడ్ నుంచి ప్రారంభించారు. జేసీబీలతో కంప చెట్లు తొలగిస్తూ, దమ్ము ట్రాక్టర్లతో నాచు తొక్కిస్తున్నారు. నాగిరెడ్డిపాలెం మీదుగా మొక్కపాడు, గుడిపాడు–1, 2 కాల్వల వరకు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

పనివేళల భారం తొలగించండి

ఎస్టీయూ డిమాండ్

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన పాఠశాలల పని వేళల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.వి.రామిరెడ్డి, యు.చంద్రజిత్‌యాదవ్ డిమాండ్ చేసారు. పని వేళల పెంపుపై గురువారం ఎస్టీయూ ముఖ్య నేతల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రభుత్వం మొదట ప్రయోగాత్మక పని వేళల పెంపు రాష్ట్రంలో ఒక జిల్లా అని ప్రకటించి, ఇప్పుడు రాష్ట్రం మొత్తం ప్రతి మండలంలో ఒక పాఠశాలను ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు వేళలు పెంచటం దారుణమన్నారు. ఇప్పటికే యాప్‌ల భారంతో ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులపై రెసిడెన్సియల్ శిక్షణ తరగతులు, అపార్ నెంబర్లు వంటి పనులతో ఒత్తిడికి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బోధనకు ఆటంకం కలిగించేలా ఉన్న యాప్‌ల భారాన్ని తొలగించాలని, శిక్షణ తరగతులను జిల్లా, డివిజన్ కేంద్రాలలో నాన్ రెసిడెన్షియల్ విధానంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎ.ఏమండీ, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు షేక్.మహబూబ్ సుభాని, కె.యేసయ్య, ఎస్.రాఘవ తదితరులు పాల్గొన్నారు.

బస్సు నుంచి పడి మహిళకు గాయాలు

సత్తెనపల్లి: ఆర్టీసీ బస్సులో నుంచి పడి వృద్ధరాలికి గాయాలైన ఘటన సత్తెనపల్లి మండలం నందిగామ ఎస్సీ కాలనీ వద్ద ఉన్న మలుపులో గురువారం జరిగింది. సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన లింగిశెట్టి సీతారావమ్మ సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామం నందు అమరావతి నుంచి సత్తెనపల్లి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఎక్కింది. నందిగామ ఎస్సీ కాలనీ వద్ద ఉన్న మూల మలుపులో ఆర్టీసీ బస్సులో నుండి ఆమె బయటపడటంతో గాయాలయ్యాయి. హుటాహుటిన అత్యవసర చికిత్స కోసం ఆమెను సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనతో గ్రామస్తులు కోపోద్రికులయ్యారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాలని గ్రామస్తులు కోరారు.

యువతి ఆత్మహత్య

దాచేపల్లి: వ్యక్తిగత కారణాల నేపథ్యంలో యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం జరిగింది. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురంకు చెందిన జి.ఆంజనేయులు కుమార్తె అంజలి (21) కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వ్యక్తిగత కారణాల నేపథ్యంలో అంజలి నడికుడి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం నరసరావుపేట తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. ఎస్సై జి.పాపారావు కేసు నమోదు చేసి అంజలి ఆత్మహత్యకు పాల్పడడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. అంజలికి వివాహం కాలేదు.





అరుదైన 'అల్‌స్టోనియా'

ఈ పూల చెట్టు పేరు అల్‌స్టోనియా. ఈ చెట్టుకు నవంబర్ నుంచి జనవరి వరకు దట్టంగా పూలు పూస్తాయి. రాత్రి, పగలు సువాసన వెదజల్లుతూ ఆకుల కన్నా ఎక్కువ దట్టంగా పూలతో ఆకర్షణీయంగా ఉంటుందీ చెట్టు. పల్నాడు జిల్లా గణపవరం మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు నివాసం వద్ద ఉన్న ఈచెట్టు వయస్సు సుమారు 10 సంవత్సరాలు. తన సుగంధ పరిమళాలతో చూపరులను ఆకర్షిస్తోంది.

– నాదెండ్ల

ప్రత్యేక పూజలు.. హోమాలు



సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన అతి పురాతన శైవక్షేత్రం గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు చిట్టేల మల్లిఖార్జునశర్మ నేతృత్వంలో స్వామి, అమ్మవార్లకు పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. పరాశక్తి పవర్‌ప్లాంట్ డిపార్ట్‌మెంట్ సత్రశాల వారు, విశ్రాంత ఎస్పీ బాణావత్ చాంద్‌నాయక్, పద్మావతి దంపతులు, ఏపీ జెన్‌కో ఏడీ భక్తులకు, మాలధారులకు అన్నదానం చేయగా ఈఓ గాదె రామిరెడ్డి, కమిటీ సభ్యులు గొట్టం శ్రీనివాసరెడ్డి, మున్నా ప్రభురాజు, నీలం మల్లయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.